క్లుప్తంగా

నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు

అశ్వారావుపేటరూరల్: మారుమూల గిరిజన ప్రాంతాలకు నూతనంగా రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వినాయకపురం సబ్ స్టేషన్ పరిధిలో మారుమూల అటవీ ప్రాంతం లోగల కావడిగుండ్ల, తిరుమలకుంట గ్రామాలకు రెండు సబ్ స్టేషన్లు మంజూరు అయ్యాయి. ఒకొక్క సబ్ స్టేషన్‌ను రూ.3కోట్ల 70లక్షల వ్యయంతో నిర్మించేలా ఆదేశాలు రాగా, ఇప్పటికే కావడిగుండ్ల గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణకు చేశారు. తిరుమలకుంట గ్రామంలో కూడా స్థల సేకరణ చేస్తున్నట్లు వినాయకపురం సబ్ స్టేషన్ ఏఈఈ సంతోష్ తెలిపారు. కాగా, ఆయా గ్రామాల్లో విద్యుత్ స్టేషన్ల నిర్మాణాలు పూర్తైతే వ్యవసాయ, గృహ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందుతాయి.

నష్టపరిహారం ఇచ్చి న్యాయం చేయండి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి తాము అడ్డు కాదని, తమకు రావాల్సిన నష్టపరిహారం మాత్రం తమకు అందించి న్యాయం చేయాలని రామాలయ అభివృద్ధికి స్థలాలు ఇచ్చిన నిర్వాసితులు సోమవారం భద్రాచలం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో ఆర్డీఓ దామోదర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆర్డీఓ నిర్వాసితులందరికి న్యాయం చేస్తామని, పేర్లు, ఇతర వివరాలలో తప్పిదాలు, మార్పులు చేర్పులు ఉంటే స్థానిక ఆర్డీఓ కార్యాలయానికి వచ్చి సరిచేయించుకోవాలని ఆయన సూచించారు. నిర్వాసితులకు ఉన్న సమస్యలను వారు ఇచ్చే సలహాలను అన్ని పరిగణలోకి తీసుకుంటామని ఆయన అన్నారు. అనంతరం గ్రామ సభను ఉద్దేశించి భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో భద్రాచలం గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, ఆర్డీఓ, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన ఉండాలి

పినపాక: విద్యార్థులు మాదకద్రవ్యాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పినపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు, వాటి వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల యొక్క శారీరక, మానసిక స్థితిగతుల పైన మాదకద్రవ్యాల ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తన పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని వారి వ్యవహార శైలిని గమనించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారిణి దుర్గ భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై సీపీఎం నిరసన

బూర్గంపాడు: పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు నిరసిస్తు సీపీఎం మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం బూర్గంపాడు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతు అంబేడ్కర్ రాజ్యాంగంలో అన్నివర్గాల అభ్యున్నతి కోసం రిజర్వేషన్లు అందించారన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటు రాజ్యాంగ సృష్టికర్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. పార్టీ నాయకులు బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, పాపినేని సరోజని,ఎస్కె అబీదా, మాజీ జెడ్పీటీసీ సభ్యులు భూపెల్లి నర్సింహారావు, పాపారావు, శ్రీను, వెంకయ్య పాల్గొన్నారు.

బ్రహ్మయ్య పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ స్వామినేని సీతమ్మ ఇటీవల మృతి చెందగా సోమవారం దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్య సీతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బేతం రామకృష్ణ, తూము వీరరాఘవులు, ఆవుల రవి, రాగం మల్లయ్య, నాయకులు, సీపీఐ, సీపీఎం, మున్నూరుకాపు సంఘం నాయకులు సీతమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఇంటింటి సర్వే..

ములకలపల్లి: మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే చురుగ్గా సాగుతోంది. 20 గ్రామపంచాయతీల పరిధిలోని కార్యదర్శులతోపాటు జీపీ వర్కర్లు, ఆయా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటిస్తున్నారు. స్థానికులతో మాట్లాడి, సమగ్ర వివరాలను నమోదు చేస్తున్నారు. ఎంపీడీఓ జి.రేవతితోపాటు మండల అధికారులు సర్వే చేపడుతున్న పరిశీలిస్తున్నారు. తిమ్మంపేటలో సోమవారం నిర్వహించిన సర్వేలో ఎంపీఓ లక్ష్మయ్య పాల్గొన్నారు. సర్వే పక్కాగా చేపట్టాలని, నిరుపేదలను గుర్తించాలని తెలిపారు.

ఘనంగా సింగరేణి వేడుకలు

- సింగరేణి పతాకం ఆవిష్కరణ
- ఆర్థిక ప్రగతిని నివేదించిన జీఎం
- హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు



వేడుకల్లో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సింగరేణి పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ జీఎం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ జీఎం వెంకటరామారావు సోమవారం పీవీకాలనీలోని భద్రాద్రి స్టేడియంలో సింగరేణి పతాకాన్ని ఎగురవేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి ఆర్థిక ప్రగతిని వివరించారు. కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సీఎస్ఆర్ నిధులతో మణుగూరు ప్రాంత పురోభివృద్ధికి చేస్తున్న కృషి, రక్షణ, పర్యావరణ పరిరక్షణ తదితర విభాగాలలో సింగరేణి అవార్డులు సొంతం చేసుకుంటోందని తెలిపారు. సింగరేణి రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ కార్మికులను సన్మానించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సింగరేణీయులు, సింగరేణి కార్మికుల కుటుంబ సభ్యులు, పుర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు వీక్షించి సందడి చేశారు. ఈ సందర్భంగా 40 స్నాక్స్ స్టాల్స్ ఏర్పాటు చేయగా, సింగరేణి గనుల పరిస్థితులు, స్థితిగతులు అందరికీ తెలిసేలా తయారు చేసిన నమూనాలు ఉంచారు. కార్యక్రమంలో అధికారులు, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సేవలు స్ఫూర్తిదాయకం..

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సింగరేణి సేవ సభ్యులు నిర్వహిస్తున్న సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని ఏరియా సేవ అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్ అన్నారు. సింగరేణి డే వేడుకల సందర్భంగా పీవీకాలనీ భద్రాద్రి స్టేడియంలో సేవ సమితి స్టాల్స్ ప్రారంభోత్సవం చేసిన ఆమె.. అశ్వాపురం ఆరీఫా అండ్ రోష్నీ వృద్ధాశ్రమానాకి 125కిలోల బియ్యాన్ని నిర్వాహకులు షెహనాజ్‌కి అందజేశారు. అలాగే సంతోష్‌నగర్ శ్రీవిద్యాభ్యాస పాఠశాల ఉపాధ్యాయిని చంద్రకళకు రూ.5వేల వేతన రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం శ్యాంసుందర్, ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్, డీజీఎం(పి) రమేష్, అధికారులు, సేవ సమితి సభ్యులు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఐటీడీఏ' స్టాల్..

భద్రాచలం: సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరగగా.. ఐటీడీఏ తరుపున స్టాల్‌ను అక్కడ ఏర్పాటు చేశారు. ఐటీడీఏ ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు సోమవారం వివరాలు వెల్లడించారు. గిరిజన మహిళలకు సంబంధించిన సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు సంబంధించి ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి, సింగరేణి సీఎండీ బలరాంతో ప్రారంభించినట్లు తెలిపారు. స్టాల్‌లో గిరిజన మహిళల యూనిట్ తయారు చేసిన సబ్బులు, షాంపూలు, న్యూట్రిషన్ మిల్లెట్ బిస్కెట్లు, అలోవెరా ఆయిల్‌తో పాటుగా వివిధ రకాల ఆదివాసీ కల్చర్‌కు సంబంధించిన కళాఖండాలు, వెదురుతో తయారుచేసిన బొమ్మలు ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేడీయం హరికృష్ణ, మహిళలు విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, లలిత, దినేష్, సలీం తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



పినపాక: విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న పాయం

మణుగూరుటౌన్: నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని, సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ప్రారంభించారు. జెడ్పీ హైస్కూల్‌లో రూ.20లక్షలతో ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్, పాఠశాల మైదానం అభివృద్ధి, ఐటీఐ కళాశాలలో రూ.30 లక్షలతో సీసీరోడ్లు, ప్రహరీగోడ పనులను ఆయన ప్రారంభించారు. అంతకుముందు ప్రజాభవన్‌లో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి వేడుకలు నిర్వహించి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సెమీక్రిస్మస్ వేడుకల్లో మండల ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పి.నవీన్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతి, హెచ్‌ఎం నాగశ్రీ, సింగరేణి అధికారులు శ్యాంసుందర్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి కృష్ణంరాజు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

పినపాక: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని ఐలాపురం ఆశ్రమ పాఠశాలను ఆయన పరిశీలించారు. భోజన సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉందన్న విషయాన్ని విద్యార్థుల దగ్గరుండి ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ నీటి ట్యాంకర్లను నిత్యం శుభ్రం చేయాలని సూచించారు. విద్యార్థుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామనాథం, నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తోలం కళ్యాణి, ఈసం భవతి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలి



భద్రాచలం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం నాయకులు, ఆదివాసులు

భద్రాచలంఅర్బన్: జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న వలస ఆదివాసీలందరికీ ఆంక్షలు లేని షెడ్యూల్ తెగ కుల ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలిచ్చి, త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ నాయకులు మాజీ ఎంపీ మీడియం బాబురావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు షరతులతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ కార్యాలయ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవనోపాధి కోసం ఛతీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన ఆదివాసులకు సర్టిఫికెట్లు నిరాకరించడం, సౌకర్యాలు కల్పించకపోవడం సరికాదని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సున్నం గంగ, మడివి రమేష్, గౌరీ నాగేశ్వరరావు, కొమరం కాంతారావు, గోవర్ధన్, కారం నరేష్, కొమరం చంటి, నాగవర్మ, సిఐటియు నాయకులు ఎంబీ నర్సారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గడ్డం స్వామి, కనితి సీత, కూసుం లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తాం



దమ్మపేట: చర్చి ఫాదర్, నాయకులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేటరూరల్: అర్హులైన ప్రతి పేదవానికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం అశ్వారావుపేటలోని కొత్త ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 57,283 మంది దరఖాస్తులు చేశారని, అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల వారిగా ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి తొలి విడతగా 3500 ఇళ్లను కేటాయిస్తామన్నారు. అనంతరం స్థానిక గిరిజన భవన్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే మండలంలోని అనంతారం, రామన్నగూడెం గ్రామాల్లో పర్యటించి సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందించారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రదీప్, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్, సత్యనారాయణ చౌదరి, కేధార్‌నాథ్, నార్లపాటి దివాకర్ పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం పాల్గొన్నారు. పాఠశాల యాజమాన్యం ఆయనను మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించారు. స్థానిక చర్చి ఫాదర్, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి, క్రిస్మస్ కేకును ఎమ్మెల్యే కట్ చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు వాసం శ్రీను, కొయ్యల అచ్యుతరావు, కక్కిరాల రమేష్, చిన్నశెట్టి యుగంధర్, వాసం వేణు, చినబాబు, చిట్టిబాబు, జేమ్స్, స్థానిక పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు అందజేత

భద్రాచలంఅర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ రివర్సైడ్ భద్రాచలం ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ మోయినాబాద్ సహకారంతో రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా 3150 మాజీ గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఓ నిరుపేద కుటుంబానికి తోపుడు బండిని అందించారు. కూరగాయలు అమ్ముకోవడానికి వీలుగా రూ.15వేలు విలువ గల తోపుడు బండిని సోలార్ లైట్‌ను అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ రివర్‌సైడ్ అధ్యక్షులు డాక్టర్ రమేష్ బాబు, కార్యదర్శి గంజి సంపత్, ట్రెజరర్ ధనకొండ రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకు పాటుపడాలి

మణుగూరురూరల్: క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మణుగూరు మండల వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ సూచించారు. మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం భగత్‌సింగ్‌నగర్ అయుష్మాన్ ఆరోగ్య మందిరంలో క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత అనుమానితులను గుర్తించి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శివకుమార్ మాట్లాడారు. డాక్టర్ నిశాంత్‌రావు, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, రామలక్ష్మి, రమణ పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కేశవరెడ్డి

అశ్వాపురం: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి సోమవారం హైదారాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసి పార్టీ కోసం పని చేసిన సీనియర్ నాయకులను గుర్తించాలని కేశవరెడ్డి ఆయన వినతిపత్రం అందజేశారు.

సీపీఎం నాయకురాలికి నివాళి

అశ్వాపురం: మణుగూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు కొట్టె పిచ్చమ్మ మృతి చెందింది. ఆమె మృతదేహానికి సీపీఎం నాయకులు పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు స్వర్గం బాలనర్సయ్య, మంగి వెంకటరమణ, ఆవుల సుధాకర్, పినికేసి సుధాకర్‌రెడ్డి, గొడుగు వెంకన్న, స్వర్గం రాఘవులు, బొడ్డు రాములు, బొమ్మరాతి రాములు, దండి రాములు, బొల్లం అయిలయ్య, పగడాల అశోక్‌రెడ్డి, తూము వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పాలు, పండ్లు పంపిణీ

మణుగూరుటౌన్: తెలంగాణ కొంగు బంగారంగా నిలుస్తున్న సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ ఆస్పత్రిలో రోగులకు సోమవారం పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిల్ యూనియన్ నాయకులు ఇజ్రాయిల్, బంగారి పవన్‌కుమార్, సింగర్ శ్రీనివాస్, నరేశ్, తదితరులు ఉన్నారు.

క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలేవి?

కరకగూడెం: క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకునేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. అందులో భాగంగా పేద క్రైస్తవులకు కానుకలతో పాటు విందుకు నగదు ఇచ్చింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం కానుకలను నిలిపివేసి, కేవలం విందు కోసం నగదుతో సరిపెట్టింది. దీంతో క్రైస్తవులు తీవ్ర నిరాశకు గురవుతున్నట్లు తెలుస్తోంది. నాటి కానుకలు ప్రభుత్వ గుర్తింపు, గౌరవంగా క్రైస్తవులు భావించారు. ఇప్పుడు అది లేకుండా పోయింది. నాడు ఒక్కో గిఫ్ట్ ప్యాకెట్‌లో పురుషుల కోసం ప్యాంటు, షర్టు, మహిళలకైతే చీర, జాకెట్, పంజాబీ డ్రెస్ ఉండడంతో పేద క్రైస్తవులకు ఎంతో సహాయకారిగా ఉండేది. ముఖ్యంగా కొత్త దుస్తులు కొనుక్కోలేని వారికి ఇవి ఉపయోగకరంగా ఉండేవి. కరకగూడెం మండల వ్యాప్తంగా సుమారు 470 క్రిస్టియన్ కుటుంబాలు ఉన్నాయి. కాగా ఈ ఏడాది విందు భోజనాల కోసం సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కరకగూడెం ఆర్ఐ కృష్ణ ప్రసాద్ పలువురు పాస్టర్లకు ప్రభుత్వం ద్వార వచ్చిన 15వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఇర్ప పాల్, కార్యదర్శి పోగు కోటయ్య, కోశాధికారి ఈసం ఇసాక్, కార్యాలయ సిబ్బంది హరీష్, శేఖర్, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.



పాస్టర్లకు నగదు అందజేస్తున్న ఆర్ఐ కృష్ణ ప్రసాద్

ఘనంగా రైతు దినోత్సవం



బూర్గంపాడు: ఆదర్శ రైతును సన్మానిస్తున్న జీకేఎఫ్ ఆగ్రో ఫారెస్ట్రీ ప్రతినిధులు

బూర్గంపాడు: అంజనాపురం గ్రామంలోని జీకేఎఫ్ ఆగ్రో ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శరైతులు గాదె నర్సిరెడ్డి, కైపు సుబ్బరామిరెడ్డి, సక్రు, లక్ష్మి, రజియాలను ఘనంగా సన్మానించారు.వక్తలు మాట్లాడుతు దేశ పురోగతిలో రైతుల పాత్ర అత్యంత కీలకమన్నారు. పాలకులు, ప్రభుత్వాలు రైతులను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో జీకేఎఫ్ ఆగ్రో ఫారెస్ట్రీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో రైతు దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మధు మాట్లాడుతూ..రైతులు దేశానికి వెన్నుముక అని, వారు చెమటను చిందిస్తేనే ప్రతి ఒక్కరి కడుపు నిండుతుందని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం పలువురు రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు మాదిరెడ్డి కృష్ణమోహన్, శ్రీదర్, వెంకటరామయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం జాతీయ రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను పాఠశాల ప్రిన్సిపల్ యుగంధర్ పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. దేశానికి రైతులు వెన్నుముక అని అన్నారు. ఎండనకా వాననకా రైతులు ఎంతో శ్రమించి పంటలను పండిస్తున్నారని, వారిని గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డీన్ భాస్కర్ రెడ్డి, శివాజీ, ఇంచార్జ్ కొమరయ్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు,విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ విధానం రద్దుచేయాలి

దమ్మపేట: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ వామపక్ష పార్టీల అనుబంధ రైతు సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధానాలకు సంబంధించిన పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. రైతు సంఘాలతో చర్చించిన తరువాతే, వారికి ఆమోదయోగ్యమైన వ్యవసాయ విధానాలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, పిట్టల అర్జున్, యంద్రాతి అప్పారావు, పండూరి వీరబాబు, ధర్మ, మోరంపూడి శ్రీనివాసరావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

దమ్మపేట: గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను పెంచి, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు సమ్మె చేయనున్నామని ఎంపీడీఓ రవీంద్ర రెడ్డికి సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. జీఓ నెంబరు 51కు సవరణలు చేసి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కారోబార్ బిల్ కలెక్టర్లకు తగిన హోదా కల్పించి, కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జనవరి 24 నుండి నిరవధిక సమ్మెకు కార్యాచరణను రూపొందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు ధర్మ, మోరంపూడి శ్రీనివాసరావు, బసవయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వంతో పాఠశాలల అభివృద్ధి



ఇరవెండి ప్రభుత్వ పాఠశాలలో కళావేదికను ప్రారంభిస్తున్న తాళ్లూరి పంచాక్షరయ్య

బూర్గంపాడు: ప్రభుత్వ నిధులతో పాటు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ఐటీసీ వంటి కార్పోరేట్ సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేసుకోవచ్చని తాళ్లూరి చారిటబల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు తాళ్లూరి పంచాక్షరయ్య అన్నారు. ఇరవెండి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో దాతలు తాళ్లూరి పంచాక్షరయ్య రూ.5 లక్షలు, వాసిరెడ్డి రాజా రూ.2 లక్షలు, ఉపాధ్యాయులు రూ.2.55 లక్షల విరాళాలతో నిర్మించిన కళావేదిక, ఆఫీస్ రూమ్, స్టాఫ్‌రూమ్, కంప్యూటర్ రూమ్, విద్యుదీకరణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఐటీసీ ఎంఎస్‌కే నిర్మించిన హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ఐటీసీ పీఎస్‌పీడీ జనరల్ మేనేజర్ చెంగలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తాళ్లూరి పంచాక్షరయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను దాతల భాగస్వామ్యంతో అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ పాఠశాల అభివృద్ధిలో ఐటీసీ సహకారం కూడా మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఐటీసీ ఎంఎస్‌కే మేనేజర్ జయప్రకాశ్,ఎంఎస్‌కే పీఓ గీతాంజలి ప్రవల్లిక, స్థానిక నాయకులు వాసిరెడ్డి రాజా, వల్లూరిపల్లి వంశీకృష్ణ, కర్నాటి రామయ్య, మహంకాళి సత్యం, మాడపాటి రఘు, హెచ్‌ఎమ్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు సుధాకర్, గోపిచంద్, జగన్,తులసి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి



గుండాల: పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న సీఆర్టీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి మునిగేల శివ ప్రశాంత్ అన్నారు. ఐటీడీఏ ఎదుట సీఆర్టీలు నిర్వహిస్తున్న నిరసన దీక్షకు ఆయన సోమవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ఇలా ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడి సీఆర్టీలకు రావాల్సిన వేతన బకాయిలను చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎంఆర్‌సీల సమస్యలు..

గుండాల: గత కొంతకాలంగా కలెక్టరేట్ల వద్ద ధర్నా చేస్తున్న కస్తూర్బా ఎంఆర్సీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి బానోత్ నరేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులను కలుపుకుని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పది రోజులుగా సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు తరగతులు జరగడం లేదని వాపోయారు. తక్షణమే సర్వశిక్షన్ అభియాన్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు హేమంత్, మహేష్, భవాని, అఖిల, సింధు ,నవ్య, బిందు తదితరులు పాల్గొన్నారు.